
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 26.0 కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY 5
నారాయణపేట
జిల్లా వార్తలు
శనివారం 26 జూలై 2025



మాతృభూమి రక్షణలో
అమరుడైన శేఖర్
● కార్గిల్ యుద్ధంలో మృతి చెందిన కామారం వాసి
● రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేటికీ అందని పరిహారం
● నేడు కార్గిల్ విజయ్ దివస్ 7

పేట నుంచి సినీ పరిశ్రమకు -చిత్రకళలో రాణిస్తున్న లక్ష్మణ్ 7

దేవ్‌సింగ్ గీసిన గీత

మారని వ్యాపారుల తలరాత!

● పాలమూరులో ఎనిమిదేళ్ల క్రితం అద్దె దుకాణాలకు బహిరంగ వేలం
● బకాయిలు రూ.కోట్లల్లో పేరుకుపోవడంతో కార్పొరేషన్ కొరడా
● ఎన్ని పైరవీలు చేసినా మారని వేలం అద్దె
● రెండు రోజుల్లో 72 దుకాణాలకు తాళం..
● మరో 100 దుకాణాలను సీజ్ చేస్తామంటున్న యంత్రాంగం



గడియారం చౌరస్తాలో మూసి ఉన్న అద్దె దుకాణాలు

మహబూబ్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మ రాసిన నుదిటి రాతను మార్చడం ఎవరితరం కాదంటారు. పాలమూరు కార్పొరేషన్ పరిధిలో నాటి కమిషనర్ దేవ్‌సింగ్ గీసిన గీతను మార్చడం కూడా ఎవరి వల్లా కావడం లేదు. అందు కోసం వ్యాపారులు ఎనిమిదేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలన్నీ బుట్టదాఖలవుతున్నాయి. చివరకు తమ దుకాణాలకు తాళాలు వేసే పరిస్థితి ఏర్పడింది. పాలమూరు మునిసిపాలిటీగా ఉన్నప్పుడు 2017 జూలై 17న లీజు కాలం పూర్తయిన 53 అద్దె దుకాణాలకు అప్పటి కమిషనర్ దేవ్‌సింగ్ బహిరంగ వేలం పాట నిర్వహించారు. అప్పటిదాకా దుకాణాలకు నెలకు అద్దె రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఉండేది. అందుకు వ్యాపారులు బహిరంగ వేలం కాకుండా అద్దె రెండింతలు చేసి, తమకే దుకాణాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఒప్పుకోని కమిషనర్ ముందు వేలంపాటలో పాల్గొనండి, తరువాత చూద్దాంలే అన్నారు. దీంతో సిట్టింగ్ వ్యాపారులు ఎలాగైనా తిరిగి దుకాణాలను దక్కించుకోవాలని పోటీపడి వేలంపాట పాడారు. రూ.50 వేల నుంచి రూ. 1.55 లక్షల వరకు వేలం పాడి, దుకాణాలను తిరిగి సొంతం చేసుకున్నారు. అప్పటినుంచి వ్యాపారులకు కష్టాలు మొదలయ్యాయి. అప్పటిదాకా రూ.5 వేల నుంచి రూ.8 వేలు అద్దె చెల్లిస్తున్న వారు ఉన్నట్టుండి నెలకు ఒక్కో దుకాణానికి రూ.50 వేలు, రూ.70 వేలు, రూ.లక్ష, రూ.లక్షా 50 వేలు చెల్లించాలంటే తలకుమించిన భారంగా మారింది. దాంతో అద్దెలు చెల్లించడం మానేశారు. వీరిని చూసి నగరంలోని మిగతా వ్యాపారులు కూడా అద్దె చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారు. నగరంలో 258 అద్దె దుకాణాలు ఉండగా, అందులో 70 దుకాణాలు పని చేయడం లేదు. మిగతా 188 దుకాణాలు నడుస్తున్నాయి. వీటిపై ఇప్పటివరకు రూ.11.50 కోట్ల బకాయి పేరుకుపోయింది.

ఎనిమిదేళ్లుగా కలవని నాయకుడు లేడు

దుకాణాల అద్దె భారం అవుతుండటం, నెలనెలా బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోతుండటంతో వ్యాపారులు ఎనిమిదేళ్లుగా కలవని నాయకుడు లేరు. గత ప్రభుత్వంలో పురపాలక మంత్రి కేటీఆర్‌ను పలుమార్లు కలిసి విన్నవించారు. అందుకు ఆయన వేలంపాటకన్నా ముందు చెల్లిస్తున్న అద్దెపై 300 శాతం ఎక్కువ చెల్లిస్తారని నోటిమాటగా చెప్పారు. అప్పటినుంచి అదే పద్ధతిన అద్దె వసూలు చేస్తున్నారు. అయితే 300 శాతం పోనూ, వేలం పాట ప్రకారం మిగతా డబ్బును వారి దుకాణాలపై బకాయిగా రికార్డుల్లో చూపుతున్నారు.

మూడు దుకాణాల అద్దె రూ.కోటి

గడియారం చౌరస్తాలో కేవలం 3 దుకాణాల అద్దె రూ.కోటి వరకు బకాయి ఉండటం గమనార్హం. బకాయిలు వందశాతం చెల్లిస్తేనే దుకాణాలను ఓపెన్ చేస్తామని అధికారులు తెగేసి చెబుతుండటంతో కొందరు డీడీలు చెల్లిస్తుండగా, మరికొందరు మాత్రం మళ్లీ నాయకుల వద్దకు వెళ్లి పైరవీలు చేయాలనుకుంటున్నారు. ఎన్ని రోజులైనా బకాయిలు మాత్రం చెల్లించక తప్పదని అధికారులు చెబుతున్నారు. మరి పెద్ద మొత్తంలో అద్దె బకాయి ఉన్న వ్యాపారులు బకాయి చెల్లిస్తారా? లేదంటే దుకాణాలను ఖాళీ చేసి కార్పొరేషన్‌కు అప్పగిస్తారా అన్నది చూడాలి.

ప్రభుత్వం మారడంతో..

2024 డిసెంబరులో ప్రభుత్వం మారడంతో వ్యాపారులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. అద్దె దుకాణాల బకాయిలు రూ.16 కోట్లకు పేరుకుపోవడంతో వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దాంతో అధికారులు నోటీసులు జారీ చేసి 3 నెలలక్రితం పలు దుకాణాలను సీజ్ చేశారు. దీంతో వ్యాపారులు మళ్లీ నాయకుల వద్దకు పరుగులు తీశారు. మొత్తం బకాయిలో 5 శాతం చెల్లించాలని నాయకుల ద్వారా చెప్పించుకున్నారు. 5 శాతం చెల్లింపులు చేసిన వారం తరువాత దుకాణాలను తెరిపించుకున్నారు. ఇప్పటివరకు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు చెల్లింపులు చేశారు. మరో రూ.11.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కూడా వసూలు చేయాలని యంత్రాంగం మరోసారి కొరడా ఝళిపిస్తోంది. గురువారం గడియారం చౌరస్తాలో 32 దుకాణాలను సీజ్ చేసిన కార్పొరేషన్ అధికారులు, శుక్రవారం మరో 40 దుకాణాలను సీజ్ చేయడంతో సీజ్ చేసిన దుకాణాల సంఖ్య 72కు చేరింది. రెండ్రోజుల్లో మిగతా 100 దుకాణాలకు కూడా తాళాలు వేయాలని యంత్రాంగం నిర్ణయించింది.



గ్రామంలోని ఓ ఇంటి వద్ద నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది



అస్వస్థతకు గురైన యాదయ్య

కాకర్లపాడు రోగం

● రెండు నెలలుగా విషజ్వరాల బారిన గ్రామ ప్రజలు
● నిత్యం జిల్లా ఆసుపత్రికి ఇద్దరు
● ప్రతీ ఇంట్లో ఎవరిని కదిలించినా కాళ్ల నొప్పులే..
● గ్రామంలో కరువైన పారిశుధ్య చర్యలు
6

పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇవ్వాలి

● అధికారులతో సమీక్షలో కలెక్టర్ విజయేందిర బోయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుంచి అనుమతులను గడువులోగా మంజూరు చేయాలని కలెక్టర్ విజయేందిబోయి చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో పరిశ్రమలపై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పరిశ్రమలకు టీజీ.ఐపాస్ కింద వివిధ శాఖల ద్వారా మంజూరు చేయాల్సిన అనుతులను సమీక్షించారు. గడువులోగా ఆదేశాలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. టీప్రైడ్ పథకం కింద షెడ్యూల్డు కులాలకు చెందిన వారికి 3 వాహనములు కేటాయించినట్లు తెలిపారు. అందులో మహేంద్ర బొలెరో మ్యాక్స్ పికప్ ట్రక్-1, ట్రాక్టర్ అండ్ ట్రైలర్-1, దోస్త్ వాహనం 1 ఇవ్వడం జరిగిందన్నారు. షెడ్యూల్డు ట్రైబ్ కులాలకు చెందిన వారికి 2 వాహనాలు కేటాయించగా అందులో మారుతి డిజైర్ 1, ట్రాక్టర్ అండర్ ట్రైలర్ 1 ఇచ్చామన్నారు. 5 మందికి వాహన పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ పి.ప్రతాప్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై తహసీల్దార్లు దృష్టి సారించి ఆగస్టు 15లోగా పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి తహసీల్దార్లను ఆదేశించారు. కాన్ఫరెన్స్ హాల్‌లో భూ భారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై తహసీల్దార్‌లతో ఆమె సమీక్ష చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15వ తేదీ వరకు వచ్చిన అన్ని దరఖాస్తులు పరిష్కారించాల్సి ఉందన్నారు. అంతకుముందే దరఖాస్తుల పరిష్కరానికి తగిన చ ర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో రె వెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఆర్డీవో నవీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జిల్లాకు నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు రాక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు శనివారం జిల్లా కేంద్రానికి రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు అప్పన్నపల్లి నుంచి బైక్ ర్యాలి నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీ మెట్టుగడ్డ, బస్‌స్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా, వన్ టౌన్ చౌరస్తా మీదుగా భగీరథకాలనీ కమాన్ సమీపంలోని అన్నపూర్ణ గార్డెన్ వరకు సాగుతుందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా జిల్లా వస్తున్న రామచందర్ రావుకు ఘన స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, బూత్ స్థాయి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్లు

కార్పొరేషన్ గెలిచి సీఎంకు కానుక ఇద్దాం

● 60 స్థానాలలో విజయం సాధించాలి
● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
● కాంగ్రెస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్లు

మహబూబ్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ నగరంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ప్రేమ ఉన్నదని, ప్రభుత్వం అధికారంలోకి రాగానే మునిసిపాలిటీగా ఉన్న పాలమూరును కార్పొరేషన్ చేసి రాష్ట్రంలో ఉన్న 13 కార్పొరేషన్‌ల సరసన నిలబెట్టారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం ఎన్ని నిధులు అడిగినా ఇస్తున్నారని, అందుకే 60 డివిజన్‌లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి కార్పొరేషన్‌ను ముఖ్యమంత్రికి కానుకగా ఇద్దామని నగర ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్‌ను వీడిన మాజీ కౌన్సిలర్‌లు గోపాల్‌యాదవ్, ఆయన సతీమణి పద్మజ, మరో మాజీకౌన్సిలర్ రామకృష్ణ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా బీజేపీ నుంచి పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతీ డివిజన్‌లో కాంగ్రెస్ తరఫున నిలబడే అభ్యర్థిలో రేవంత్‌రెడ్డిని చూడాలన్నారు. ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ వచ్చిన తరువాత కార్పొరేషన్ పరిధిలో రూ.200 కోట్ల అభివృద్ధి పనులు చేసుకున్నామని గుర్తు చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి ఎంతో ప్రయత్నిస్తున్నారన్నారు. బీసీలకు బీఆర్ఎస్‌లో కనీస గౌరవం ఉండేది కాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు మల్లు నర్సింహారెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, ఆనంద్ కుమార్‌గౌడ్, ఎన్‌పీ వెంకటేశ్, బెక్కరి అనిత, మారెపల్లి సురేందర్‌రెడ్డి, వసంత, అమరేందర్‌రాజు, రాఘవేందర్ రాజు, సిరాజ్‌ఖాద్రి, జహీర్‌అక్తర్, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం స్నేహ పూర్వక మార్గం

● 'పేట' జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసులు

నారాయణపేట టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో స్నేహపూర్వక మార్గంగా కేసులను పరిష్కరించుకోవచ్చని నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయాధికారి బోయ శ్రీనివాసులు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌లో 90 రోజుల మధ్యవర్తిత్వం ద్వారా ఇది సాధ్యమౌతుందని చెప్పారు. వివాహ వివాదాల కేసులు, ప్రమాద దావా, గృహహింస, చెక్ బౌన్స్, వాణిజ్య వివాదాలు, సర్వీసు, క్రిమినల్ కాంపౌండబుల్, వినియోగదారుల వివాదాలు, భూ సేకరణ, సివిల్ కేసులు పరిష్కరించుకోవడానికి ఇది అద్భుతమైన అవకాశమన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నారాయణపేట జిల్లాలోని అన్ని కోర్టులలో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారానికి 2,178 కేసులను గుర్తించినట్లు చెప్పారు. వాటిని త్వరగా పరిష్కరించాలని న్యాయమూర్తులను ఆదేశించారు. మధ్యవర్తిత్వం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఇరు పక్షాల మధ్య సంబంధాలు దెబ్బతినకుండా భవిష్యత్తులో కూడా మంచి వాతావరణం ఉండటానికి దోహద పడుతుందన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి వింధ్యనాయక్, బి.సాయిమనోజ్, జూనియర్ సివిల్ న్యాయాధికారి పాల్గొన్నారు.





మరికల్ పోలీస్ స్టేషన్‌లో సామగ్రిని తనిఖీ చేస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

మెరుగైన సేవలు అందించాలి

● ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలి
● సాంకేతిక వ్యవస్థపై అవగాహన ఉండాలి: ఎస్పీ యోగేష్ గౌతమ్

మరికల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు పోలీసులు అండగా ఉన్నారనే నమ్మకం, భరోసా కల్పిస్తూ.. మార్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ చెప్పారు. శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా ఎస్పీ మరికల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాట్టారు. అనంతరం పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. ఏమైనా సమస్యలున్నాయా? అని సిబ్బందిని అడిగారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయని ఆరా తీసి, ఎలా పరిష్కరించాలో సూచనలు చేశారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ గ్రామాలను రోజూ విధిగా సందర్శించాలన్నారు. రికార్డులు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్ర స్తుతం దర్యాప్తులో ఉన్న కేసులను పరిశీలించి, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 24 గంటలు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు పోలీస్ వ్యవస్థపై విశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించి, నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. సాంకేతిక వ్యవస్థపై సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ రాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉషు ఉమెన్స్ లీగ్‌కు 10 మంది విద్యార్థినులు 7
● ఈనెల 27న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పోటీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జల్లులు 7
● పాలమూరులో 15 మి.మీ. వర్షపాతం నమోదు

కాకర్లపాడు రోగం



ఒకేచోట కూర్చున్న గ్రామస్థులు

- రెండు నెలలుగా విషజ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- నిత్యం జిల్లా ఆసుపత్రికి ఇద్దరు
- ప్రతీ ఇంట్లో ఎవరిని కదిలించినా కాళ్ల నొప్పులే..
- కాకర్లపాడ్ గ్రామంలో పారిశుధ్య చర్యలు శూన్యం

నవాబ్‌పేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్లపాడ్ గ్రామానికి రోగమొచ్చింది. ప్రతీ ఇంట్లో ఎవరిని కదిలించినాతీవ్ర కీళ్ల నొప్పులు, జ్వరంతో బాధపడుతున్నారు. గ్రామానికి చెందిన మన్నెమ్మ తన పనులు చేసుకుంటూ ఎంతో హుషారుగా ఉండగా, ఉన్నట్లుండి కీళ్ల నొప్పులు మొదలై జ్వరంతో మంచం పట్టింది. యాదయ్య పొలం పనులు చేసుకుంటూ గ్రామంలో అందరిని కలుస్తుండేవాడు. వారం రోజులుగా ఇంటి నుంచి బయటకు రావడం లేదు. ఇలా గ్రామంలో అందరికీ రోగమొచ్చి ఆసుపత్రిలో, ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఏ ఇంట్లో చూసినా ఒకరి నుంచి నలుగురి వరకు తీవ్ర జ్వరంతో అల్లాడిపోతున్నారు.


ఇంటి వద్ద తీవ్ర జ్వరంతో పడుకున్న మన్నెమ్మ

రెండు నెలలుగా ఇదే తంతు..

గ్రామానికి చెందిన గడ్డమీది రమేష్ తాపీ మేస్త్రీ పని చేసి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో మొదట ఆయనకు చికున్ గున్య సోకింది. ఇది ఒక్కరితో మొదలై ఊర్లో అందరిని పట్టి పీడిస్తోంది. పిల్లలతో సహా వృద్ధులు సైతం అందరికి ఈ వ్యాధి బారిన పడినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో ఎవరిని కలిసినా కాళ్ల నొప్పుల గురించే మాట్లాడుకుంటున్నారు. కుర్చున్న చోట ఒకరికొకరు బాధలు చెప్పుకుంటున్నారు. జిల్లా కేంద్రానికి సుమారు పది కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామ ప్రజలు నిత్యం ఏదో ఒక పని చేసుకుంటు జీవనం సాగిస్తుంటారు. ఇప్పుడు ఎక్కువ శాతం రెండు నెలలుగా మంచం పట్టి కాలం వెల్లదీస్తున్నారు.

పారిశుధ్య చర్యలు శూన్యం

గ్రామంలో పారిశుధ్య చర్యలు అంతంతమాత్రంగా ఉన్నాయి. ఎస్సీ, బీసీ, ఇతర కాలనీలలో ఎలాంటి శుభ్రత చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. మురికి ఉన్న ప్రాంతాలను గుర్తించి చెత్త తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని గ్రామస్థులు వాపోయారు.

క్షేత్రస్థాయిలో పనిచేయని వైద్య సిబ్బంది

గ్రామంలో రోగాలు విజృంభిస్తుంటే స్థానికంగా అందుబాటులో ఉండే ఆశాకార్యకర్తలు ఎందుకు అధికారులకు సమస్యలు వివరించలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇంత సమస్యను చిన్నదిగా చూపించి కేవలం తూతూ మంత్రంగా ఇలా వచ్చి పర్యటనలు చేసి వెళ్తున్నారే తప్పా రోగాన్ని గుర్తించి నయం చేసేందుకు క్యాంపులు ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాగా శుక్రవారం మండల పీహెచ్‌సీ అధికారుల బృందం ఎంఈఎల్‌వో రాములు ఆధ్వర్యంలో కాకర్లపాడులో పర్యటించింది. మురుగు, కుండల్లో ఉన్న నిల్వ నీరు పారబోశారు. మోకాళ్ల నొప్పులున్న వారిని పీహెచ్‌సీ వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు.

పట్టించుకోవడం లేదు..



గ్రామంలో రోగాల పాలవుతున్న తమను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలా వచ్చి మందు గోలీలు ఇచ్చి పోతున్నారు. ఏం జరిగింది? ఎందుకు వచ్చింది ఈ రోగం అని డాక్టర్లు తమ గ్రామానికి వచ్చి అడగడం లేదు. మా ప్రాణాలు పోతున్న పట్టించుకోరా?

- చుక్కమ్మ కాకర్లపాడ్

అందరికీ ఇదే రోగం..



మా ఊర్లో కొన్ని రోజులుగా కాళ్ల నొప్పుల రోగం ఉంది. చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. డాక్టర్లు రావడం లేదు. రోజూ పాలమూరు దవాఖానాకు మా ఊరోళ్లు పోతున్నారు. డాక్టర్లు మా ఊరుకు వచ్చి రోగం తగ్గేలా చూడాలి. నా తోటి విద్యార్థులు కూడా కాళ్ల నొప్పులతో పాఠశాలకు వస్తున్నారు.

- శివాని, కాకర్లపాడ్

చికున్ గున్య కేసులు అనలేం..

గ్రామంలో కొంతమందికి నొప్పులు ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఇవి చికున్ గున్య కేసులు అనలేం. గ్రామంలో కేవలం కాకార్లపాడ్ వరకే 2,500 మంది ఉంటారు. ఇందులో 400 కుటుంబాలు ఉంటాయి. నిత్యం ప్రజలకు మాత్రలు అందజేస్తున్నాం. తాజాగా గ్రామానికి చెందిన వారు జిల్లా ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిసింది. వ్యాధి నిర్ధారణ తర్వాతే మాత్రలు అందజేస్తున్నాం ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నాం.

- రజిత, ఏఎన్ఎం, కాకర్లపాడ్

వైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం

కాకర్లపాడ్ గ్రామంలో ప్రజల అవగాహనలేమితో సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. చికున్‌గున్య నివారణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం. ముందుగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వైద్య సిబ్బంది సూచనలు పాటించాలి.

- కృష్ణ, డీఎంహెచ్‌వో, మహబూబ్‌నగర్

31న కంటి ఆపరేషన్ శిబిరం

కందనూలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31న గురువారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఆప్తాలమిక్ అధికారి కొ్ట్ర బాలాజీ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం గది నెంబరు 102లో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పొర గల వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించనున్నట్లు పేర్కొన్నారు. రోగులు ముందుగా బీపీ, షుగరు పరీక్షలు చేసుకుని రిపోర్టు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఈ ప్రాంత రోగులు ఆధార్, రేషన్‌కార్డు, ఓటరు కార్డు, ఏదేని గుర్తింపు కార్డు, జిరాక్స్ కాపీ, ఫోన్ నెంబరును తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. వివరాలకు 9440876556, 7386940480లో సంప్రదించాలన్నారు.

జాతీయ శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక

- జీడిపల్లితండా ఉపాధ్యాయుడు రఘురాంకు అవకాశం


రఘురాం

కల్వకుర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నూతన జాతీయ విద్యావిధానం -2020లో భాగంగా బోధన అభ్యసన పద్ధతులను సృజనాత్మకంగా మార్చేందుకు ఏర్పాటు చేసిన జాతీయ శిక్షణ కార్యక్రమానికి కల్వకుర్తి మండలం జీడిపల్లితండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రఘురాం ఎంపికయ్యారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 10 వరకు రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌లోని సీసీఆర్‌టీలో జరగనున్న శిక్షణకు ఎంపికయ్యారు. గత నెల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి శిక్షణలో వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థుల హాజరు పెంచే సృజనాత్మక కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధి, టీఎల్ఎం వంటి అంశాల మీద పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించి నిపుణుల ప్రశంసలు అందుకున్నారు. మొత్తం తెలంగాణ రాష్ట్రం నుంచి పది మంది ఎంపిక కాగా నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి రఘురాం జీడిపల్లితండా ప్రాథమిక పాఠశాల నుంచి రఘురాం, ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గాజుల వెంకటేశ్ ఎంపికయ్యారు. జాతీయ స్థాయి వేదికపై ప్రతిభకు అవకాశం రావడం పట్ల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలి

- వనపర్తి డివిజన్ తపాలా పర్యవేక్షకుడు భూమన్న


రికార్డులను పరిశీలిస్తున్న భూమన్న

వెల్దండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : తపాలా శాఖ ద్వారా అందిస్తున్న జీవిత, ప్రమాద బీమాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి డివిజన్ తపాలాశాఖ పర్యవేక్షకుడు భూమన్న సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తపాలా కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో తమ శాఖ ద్వారా బీమాసౌకర్యం పొందవచ్చునన్నారు. అదేవిధంగా వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే పొదుపు, రికరింగ్ డిపాజిట్లు, ఆడపిల్లలకు సుకన్యయోజన పథకాలు ఉన్నాయన్నారు. ప్రైవేటు కంపెనీలతో కలిసి తక్కువ ప్రీమియంతో పెద్దమొత్తంతో బీమా పొందే అవకాశాలు ఉన్నాయని వివరించారు. తపాలాశాఖ నగదురహిత కార్యక్రమాలు చేపడుతుందని భూమన్న తెలిపారు. కార్యక్రమంలో పీఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది రతన్‌నాయక్, రాజేందర్‌రెడ్డి, పుష్పగిరిరావు, శ్రీనునాయక్, సత్యం, పవన్ ఉన్నారు.

అచ్చంపేటకు బిహార్ పోలీసులు

- సైబర్ నేరంలో నిందితుడి కుటుంబ సభ్యుల విచారణ
- వారి ఇల్లు, మెడికల్ దుకాణాల్లో తనిఖీలు


పట్టణంలో విచారిస్తున్న పోలీసులు

అచ్చంపేట టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైంకు సంబంధించిన విచారణ కోసం బిహార్ రాష్ట్రానికి చెందిన పోలీసులు శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేటకు వచ్చారు. ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... వెంకటరమణ అనే వ్యక్తి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. అతడి కుమారుడు అనిరుద్ ఉన్నతవిద్య పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతడు సైబర్ నేరాలకు పాల్పడి బిహార్ రాష్ట్రానికి చెందిన పలువురు బ్యాంకు ఖాతాల్లో నుంచి దాదాపు రూ. 2 కోట్ల మేర డ్రా చేశాడు. ఆ డబ్బును తండ్రి వెంకటరమణ, నల్గొండ జిల్లా కోదాడకు చెందిన తన భార్య ఖాతాలకు మళ్లించాడు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు కావడంతో బిహార్ రాష్ట్రం నుంచి డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది శుక్రవారం అచ్చంపేటకు చేరుకున్నారు. పట్టణంలోని వెంకటరమణ ఇల్లు, మెడికల్ షాపు, సమీప బంధువుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. అనిరుద్ కోసం గాలించగా ఆచూకీ లభించలేదని ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు


క్రేన్ సహాయంతో కారును బయటకు తీస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ బస్సును తప్పించే ప్రయత్నంలో కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండల పరిధిలోని మూలమల్ల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరకద్రకు చెందిన యువకులు శుక్రవారం మధ్యాహ్నం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 6 గంటల సమయంలో మూలమల్ల గ్రామం మీదుగా వెళ్తుండగా ఎదురుగా స్కూల్ బస్సు వచ్చింది. బస్సును తప్పించబోయి అదుపు తప్పిన కారు చెరువులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న యువకులు అప్రమత్తమై కిందకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు.

పీడిత ప్రజల భావజాలమే గద్దర్ గళం

- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల
- 'ప్రజా యుద్ధ నౌక గద్దరన్న' పాటల సీడీ ఆవిష్కరణ


జయప్రకాశ్ రచించి పాడిన ప్రజా యుద్ధనౌక గద్దరన్న పాటల సీడీని ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి, చైర్ పర్సన్ డాక్టర్ వెన్నెల

బిజినేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పీడిత ప్రజల భావజాలమే గద్దర్ గళమై గర్జించిందని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని మహాదేవుని పేట గ్రామానికి చెందిన జయప్రకాశ్ రచించి, గానం చేసిన 'ప్రజా యుద్ధ నౌక గద్దరన్న' ఆడియో సీడీని శుక్రవారం హైదారాబాద్‌లోని సాంస్కృతిక సారథి కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గద్దర్‌ను ఆదర్శంగా తీసుకొని ఉద్యమంలో గజ్జకట్టి ఆడి పాడి ప్రజలను చైతన్య పర్చిన వారిలో జయప్రకాశ్ ఒకరని గుర్తు చేశారు. కళాకారులు ఆట, పాట, మాటల్లో ముందు వరుసలో ఉండి సమాజ ఉద్ధరణలో భాగస్వాములు కావాలని తెలిపారు.

గడ్డం రవీందర్ అందించిన సంగీతం బాగుందని కొనియాడారు. కోరస్ గాయకులు లక్ష్మణ్, విజయ్‌కాంత్, అశోక్‌చారి, ఉదయ్, రాజు, సంతోష్, పద్మలను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్ అధికారి విజయ్ కుమార్, రచయిత య శ్‌పాల్ స్వామి, మాపల్లె శంకర్, నరసింహ, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

తేజేశ్వర్ హత్య కేసులో.. పోలీసు కస్టడీకి ఇద్దరు నిందితులు

- ఇన్వెస్టిగేషన్ అధికారి టంగుటూరి శ్రీను

గద్వాల క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితులు ఇద్దరిని శుక్రవారం పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. జోగుళాంబ గద్వాల పట్టణానికి చెందిన లైసెన్స్‌డ్ సర్వేయర్ తేజేశ్వర్ హత్యకేసులో ఏ1 తిరుమల్‌రావు, ఏ2 ఐశ్వర్యలను మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు అనుమతి లభించినట్లు ఇన్వెస్టిగేషన్ అధికారి, సీఐ టంగుటూరి శ్రీను శుక్రవారం తెలిపారు. ఈ నెల 10న ఏ1 తిరుమల్‌రావుతోపాటు ఏ3 నాగేశ్, ఏ4. పరశురామ్, ఏ5 రాజులను పోలీసులు నాలుగు రోజులు కస్టడీలోకి తీసుకొని విచారించారు. మరో సారి ఏ1 తిరుమల్‌రావుతో పాటు, ఏ2ను ఐశ్వర్యలను కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు ఇటీవల కోర్టులో అప్పీలు చేశారు. అందుకు న్యాయాధికారి శుక్రవారం అనుమతి ఇవ్వడంతో ఇద్దరు నిందితులను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వారిని విచారించి హత్యకు కారణాలను రాబట్టనున్నారు.

కల్లు దుకాణంపై ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారుల దాడి

- 468 లీటర్ల కల్లు ధ్వంసం, ముగ్గురిపై కేసు

గద్వాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం గోనుపాడు గ్రామంలోని కల్లు దుకాణంపై గురువారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు నిర్వహించారు. మహబూబ్‌నగర్ నుంచి సీఐ బాలకృష్ణారెడ్డి, ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం గోనుపాడు గ్రామంలోని దుకాణాన్ని తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా నిర్వహించడంతో పాటు కృత్రిమంగా కల్లును తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడిలో 50 కేజీల చక్కెర, 5 కేజీల పేస్టును స్వాధీనం చేసుకున్నారు. 468 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. అదేవిదంగా 640 కల్లు పెట్టెలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని, దుకాణం నిర్వాహకులు గుండ్రాతి సాంబశివుడు, లక్కిసాని కిషోర్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్‌లపై కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లో ఇటీవల కల్తీకల్లు తాగి పలువురు మృతి చెందడంతో ఎక్సైజ్ అధికారులు లైసెన్స్‌లేని కల్లు దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో దాడులు నిర్వహించడం వారంలో ఇది రెండవ సారి.

నకిలీ పత్రాలు సృష్టించిన వ్యక్తి

- రూ. 10 లక్షలకు మార్టిగేజ్
- గద్వాల ఎస్ఐ కల్యాణ్‌కుమార్

గద్వాల క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇతరులకు సంబంధించిన ప్లాటుకు నకిలీ పత్రాలు సృష్టించి, వాటిని రూ. 10 లక్షలకు మార్టిగేజ్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గద్వాల ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలాలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని 3వ వార్డుకు చెందిన బోయ శ్రీనివాసులు సర్వే నెంబర్ 79/బిలోని ప్లాటును 2019లో షాలిబీ అనే మహిళ నుంచి కొనుగోలు చేశాడు. కానీ 2018 లో హెచ్. గోపాల్ అనే వ్యక్తి ఆ ప్లాటులో రేకుల షెడ్డు, దానికి ఇంటి నెంబర్ ఉన్నట్లు, దానిని తనతల్లి హెచ్.లక్ష్మి ద్వారా గిఫ్ట్‌డీడ్ పొందినట్లు నకిలీ పత్రాలను సృష్టించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్లాట్ యజమాని బోయ శ్రీనివాసులు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు గోపాల్ పేరును ఆన్‌లైన్‌లో నుంచి తొలగించారు. అయితే గోపాల్ తన వద్ద నున్న నకిలీ ధ్రువపత్రాలతో ఈ ఏడాది మార్చి 19న కర్నూలులోని శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్-2లో ఆస్తిని రూ. 10 లక్షలకు మార్టిగేజ్ చేశాడు. ఈ విషయంపై అసలు యజమాని బోయ శ్రీనివాసులు మే 26న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు విచారణ చేపట్టి, శుక్రవారం నిందితుడు గోపాల్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

వైద్యుడి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- మెడపై కణతిని తొలగించమంటే కాటికి పంపారంటూ కుటుంబీలకు ఆరోపణ
- ఓ ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రి నిర్వాకం
- ఆసుపత్రి ముందు కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన


కాటేపోగ రాజు (ఫైల్)

పెబ్బేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మెడపై ఉన్న కంతిని తొలగించి చికిత్స చేసిన ఒక వైద్యుడి నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైందని ఒక ప్రైవేట్ ఆసుపత్రి ముందు శుక్రవారం కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాలు... వనపర్తి జిల్లా పెబ్బేరు మండంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన దళిత మేస్త్రీ కాటేపోగ రాజు(39) మెడపై ఉన్న కంతి చికిత్స కోసం 19న మునిసిపాలిటీలోని ఒక ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లాడు. ఆసుపత్రి వైద్యుడు ఎలాంటి వైద్య పరీక్షలు, మత్తు ఇంజక్షన్ చేయకుండానే అతడ్ని నిలబెట్టి మెడపై ఉన్న కంతిని తొలగించి కొన్ని మాత్రలు ఇచ్చారు. తరువాత రెండు రోజుల వరకు అదే ఆసుపత్రిలో తొలగించిన కంతిని డ్రస్సింగ్ చేయించుకున్నాడు. 22న ఆసుపత్రిలో డ్రస్సింగ్ చేయించుకునేందుకు వచ్చిన సందర్భంలో కంతి తొలగించిన ప్రాంతంలో బాగా నొప్పి ఉందని వైద్యుడికి చెప్పాడు. ఏం కాదు మాత్రలు వాడండి తగ్గిపోతుందన్నారు. 24న సాయంత్రం 7గంటలకు బహిర్భూమికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కళ్లు తిరిగి కిందపడిపోయాడు. రాజు ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించగా కిందపడిపోయిన అతడ్ని అదే ఆసుపత్రికి తీసుకువెళ్లారు. నేను ఏం చేయలేను.. వనపర్తికి తీసుకువెళ్లాలని ఆసుపత్రి వైద్యుడు చెప్పాడు. వనపర్తి ఆసుపత్రిలోని వైద్యులు పరిశీలించి మెదడులో రక్తం గడ్డకట్టింది.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ ఉన్న వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారన్నారు.


ఆసుపత్రిలో ఆందోళన చేస్తున్న మృతుని భార్య రాధ, నలుగురు పిల్లలు

ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

మృతుని కుటుంబ సభ్యులు కంతి వైద్యం చేసిన వైద్యుడి దగ్గరకు వెళ్లి మీ నిర్లక్ష్యం వల్లనే మృతి చెందాడని చెప్పారు. మృతి చెందడానికి.. నాకు ఎలాంటి సంబంధం లేదు.. నేను కేవలం కంతిని తొలగించి చీము తీసి రెండు కుట్లు వేశానని వైద్యుడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఆగ్రహంతో ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతుని కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి శాంతింప చేశారు. పెద్దమనుషుల సమక్షంలో దళితుడైన మృతుడు కాటేపోగ రాజు ప్రాణం ఖరీదు రూ.8లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం తెలుస్తున్నది. మృతుడికి భార్య రాధతో పాటు తొమ్మిదేళ్ల సౌజన్య, ఏడేళ్ల మహేందర్, రెండేళ్ల బిట్టు, ఒక సంవత్సరం పాప ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తప్పు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం



ప్రైవేట్ ఆసుపత్రిలో కంతి తొలగించేందుకు చేసిన సర్జరీతోనే మృతి చెందారనే ఆరోపణలు మా దృష్టికి వచ్చింది. అర్హులైన వైద్యులు మాత్రమే సర్జరీ చేయాలి. కొన్ని అనివార్య కారణాలతో రాలేకపోయాను. దీనిపై శని వారం విచారణ అధికారిని నియమించి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ అల్లే శ్రీనివాసులు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, వనపర్తి.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు

- అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు


మహబూబ్‌నగర్‌లో ఎల్లమ్మ గుడిలో క్యూలైన్‌లో భక్తులు


గద్వాల కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళల సామూహిక కుంకుమార్చన

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ గద్వాల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసంలో తొలి శుక్రవారం సందర్భంగా మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రాల్లోని ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహబూబ్‌నగర్ కొత్త బస్టాండ్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి, చౌడేశ్వరి ఆలయాల్లో నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


అమ్మవారికి హారతి ఇస్తున్న పూజా


ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణదేవి

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో నిత్యాభిషేకం ప్రారంభించారు. ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని తారమపూలతో అలంకరించారు. అన్నపూర్ణాదేవి ఆలయంలో అమ్మవారు గౌరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.


మహబూబ్‌నగర్‌లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


మహబూబ్‌నగర్‌లో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

క్రైం కార్నర్

20 ద్విచక్రవాహనాలు సీజ్

» జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో తనిఖీలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు

గద్వాల క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నెంబర్ ప్లేట్ లేని 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు ఆధ్వర్యంలో జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లాట్ లేనివి, ఉన్నా కనిపించకుండా చేసిన బైక్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను తీసుకొస్తే తిరిగి ఇస్తామని వాహనదారులకు స్పష్టం చేశారు. నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో పశువుల మృతి



అవుసులోనిపల్లిలో కరెంటు షాక్‌తో చనిపోయిన ఆవు

కల్వకుర్తి/ ఊట్కూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలో ఎద్దు, నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలో ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్వకుర్తి మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన రైతు బలమూరి బాలస్వామి ఎద్దు పొలంలో మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. దాని విలువ రూ.80 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. అలాగే ఊట్కూర్ మండలంలోని అవుసులోని పల్లి గ్రామానికి చెందిన రైతు వడ్డెమాన్ గోపాల్‌రెడ్డికి చెందిన ఆవు శుక్రవారం మధ్యాహ్నం బీడు భూమిలో మేత మేస్తుండగా విద్యుత్ తీగలకు తగిలి కరెంట్ షాక్‌కు గురై చనిపోయింది. దాని విలువ రూ. 60 వేలు ఉంటుందని బాధితుడు గోపాల్‌రెడ్డి తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఖిల్లాఘణపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రం సమీపంలో గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డి గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై ఖిల్లాఘణపురం నుంచి స్వగ్రామానికి బయలు దేరాడు. షాపూర్ స్టేజీ దాటిన తర్వాత రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టడంతో అతడు గాయపడ్డాడు. స్థానికులు అతడిని ఖిల్లాఘణపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి మాట్లాడే స్థితిలో లేకపోవడంతో ఏఎస్ఐ సత్యనారాయణ గౌడ్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడి వివరాలు తెలుసుకునేందుకు యత్నిస్తున్నట్లు చెప్పారు.

నల్లమలలో శ్రీశైలానికి చెందిన వ్యక్తి అదృశ్యం

» ఆటోను స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ అధికారులు



లక్ష్మణ్

మన్ననూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, శ్రీశైలం క్షేత్రానికి చెందిన ఓ వ్యక్తి నల్లమల అడవిలో అదృశ్యం అయ్యాడు. అటవీశాఖ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నా యి. నాగర్‌కర్నూలు జిల్లా, అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూరు, వటవర్లపల్లి గ్రామాల మధ్య శుక్రవారం అటవీ శాఖ పెట్రోలింగ్ సి బ్బంది తనిఖీలు చేస్తుండగా ఓ ఆటో కనిపిం చింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా సం బంధించిన వారెవరూ కనిపించలేదు. దీంతో ఆటోను మన్ననూరులోని దు ర్వాసుల చెరువు బేస్ క్యాంపునకు తరలించారు. అనంతరం అధికారులు ఆ టోలో పరిశీలించగా ఆధార్‌కార్డు లభ్యమైంది. దానిపై ఉన్న నెంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఆ ఆటో శ్రీశైలంలోని వడ్డెరకాలనీకి చెందిన భీమ్‌రావు కుమారుడు మంజుల లక్ష్మణ్ అని తెలుసుకున్నారు. అతడు శుక్రవారం ఉ దయం శ్రీశైలం నుంచి బయలు దేరి, తిరిగి రాలేదని చెప్పారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి సమాచారం అందించాలని పెట్రోలింగ్ సిబ్బంది కోరారు.

లిక్కర్‌మార్ట్‌లో చోరీ

» రూ. 2 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు

వనపర్తి రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలోని లిక్కర్ మార్ట్‌లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. టౌన్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పట్టణ కేంద్రంలోని రామాలయం సమీపంలోని లిక్కర్ మార్ట్‌లో బ్రహ్మం అనే వ్యక్తి పని చేస్తున్నాడు. గురువారం రాత్రి మార్ట్‌ను మూసివేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం దుకాణాన్ని తెరిచి లోపలికి వెళ్లగా అనుమానాస్పదంగా వెలుతురు కనిపించింది. పైకి చూడగా, రేకులకు రంధ్రం కనిపించడంతో అనుమానంతో కౌంటర్‌ను తెరిచి చూశాడు. అందులోని రూ. 2,08,000 చోరీకి గురైనట్లు గుర్తించి, వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. వారు వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

మాతృభూమి రక్షణలో అమరుడైన శేఖర్

- 1996లో భారత సైన్యంలో చేరిన శేఖర్
- 1999 కార్గిల్ యుద్ధంలో విధి నిర్వహణ
- ఆర్మీ క్యాంపుపై ముష్కరుల దాడిలో మృతి
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేటికీ అందని పరిహారం

నేడు కార్గిల్ విజయ్ దివస్

దేశానికి సేవ చేయాలన్నది అతడి లక్ష్యం... గుండె నిండా సంకల్పం అతడిని ముందుకు నడిపించింది. అందుకు స్నేహితుల ప్రోత్సాహం తోడయ్యింది. ఆర్మీ ర్యాలీలో పాల్గొని తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించి భారత సైన్యంలో చేరాడు. కార్గిల్ యుద్ధ సమయంలో విధుల్లో ఉండగా, ఆర్మీ క్యాంపుపై శత్రు మూకలు దాడి చేయడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారు. వారిలో అతడు కూడా ఉన్నాడు. అతడే మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కామారం గ్రామానికి చెందిన శేఖర్. నేడు (శనివారం) కార్గిల్ విజయదివస్ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- నవాబ్‌పేట (ఆంధ్రజ్యోతి)



గత ఏడాది శేఖర్ తల్లి రాధమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి (ఫైల్)



కార్గిల్ యుద్ధంలో మరణించిన శేఖర్ (ఫైల్)

మాతృ భూమి రక్షణ కోసం సైన్యంలో చేరిన శేఖర్ కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలం కామారం గ్రామానికి చెందిన రామచంద్రయ్యాచారి, రాధమ్మ దంపతులకు ముగ్గురు సంతానం ఉన్నారు. వారిలో మూడవ కుమారుడు శేఖర్ యన్మనగండ్ల ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంటూ అన్నలకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. 1996లో తిరుపతి పట్టణంలో ఆర్మీ ర్యాలీ జరుగుతోందని స్నేహితుల ద్వారా అతడికి తెలిసింది. వారి ప్రోత్సాహంతో దరఖాస్తు చేసుకొని ర్యాలీలో పాల్గొన్నాడు. తొలి ప్రయత్నంలోనే సైన్యంలో ఉద్యోగం సాధించి 19-మద్రాస్ విభాగంలో చేరి, జమ్ము కశ్మీర్లో విధులు నిర్వహిస్తుండేవాడు. 1999, నవంబర్ 24న అతడు పూంచ్ సెక్టర్ వద్ద విధుల్లో ఉండగా, ఆర్మీ క్యాంపుపై ముష్కరులు దాడి చేశారు. ఈ దాడిలో శేఖర్ కూడా ప్రాణాలు కోల్పోయారు. ఆర్మీ అధికారులు ఈ విషయాన్ని టెలిగ్రాం ద్వారా అతడి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని అతడి స్వగ్రామానికి తరలించింది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది. అప్పటి మంత్రి నాగం జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్ రావు, ఎర్రశేఖర్‌లతో పాటు, కలెక్టర్ అనంతరాములు పాల్గొన్నారు.

సన్మానాలతో సరి..

కార్గిల్ యుద్ధంలో శేఖర్ మరణించడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అతడి కుటుంబంపై అపారమైన సానుభూతి వ్యక్తమయ్యింది. ఆయన ప్రాణత్యాగం వృథా కాదంటూ ఎంతో మంది కొనియాడారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు అతడి కుటుంబ సభ్యులను సన్మానించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలో శేఖర్ విగ్రహం ఏర్పాటు చేస్తామంటూ పలువురు ముందుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అతడి కుటుంబానికి రూ. 7.50 లక్షల పరిహారం అందింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 5 లక్షలు, 300 గజాల స్థలం ఇవ్వాల్సి ఉండింది. కానీ రూ. 5 వేలు మాత్రమే ప్రభుత్వం చెప్పడంతో కోర్టును ఆశ్రయించారు. కానీ ఇప్పటివరకు పరిహారం మాత్రం అందలేదు. ఈ విషయంపై శేఖర్ సోదరుడు ఈశ్వరయ్య, తల్లి రాధమ్మ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

గత ఏడాది కార్గిల్ దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలో శేఖర్ తల్లి రాధమ్మను ప్రస్తుత పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు రావలసిన పరిహారం, ప్లాటు ఇవ్వాలని శేఖర్ సోదరుడి కుమారుడు సత్యం విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జల్లులు

వనపర్తి/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ మహబూబ్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి, శుక్రవారం జల్లులు పడ్డాయి. నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో 13.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. కొత్తపల్లి 9.8, దామరగిద్ద 9.3, ఊట్కూర్ 8.5, కృష్ణ 7.8, మద్దూర్ 6.8, నారాయణపేట మండలంలో 6.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. నాగర్‌కర్నూలు జిల్లా ఊర్కొండ మండలంలో 9.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పెద్ద కొత్తపల్లి మండలంలో 9.4, కల్వకుర్తిలో 7.0, లింగాలలో 6.2, అచ్చంపేట, వెల్దండ మండలాల్లో 6.0, ఉప్పునుంతల, తిమ్మాజిపేట మండలాల్లో 5.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వనపర్తి జిల్లా పెబ్బేరు, ఆత్మకూరులలో 4.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ జల్లులు కురిశాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం 6 గంటల తరువాత వాతావరణం ఒక్కసారి మేఘావృతమై కొద్దిసేపు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గండీడ్ మండలంలో 11.7, బాలనగర్‌లో 11.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జడ్చర్లలో రహదారులు జలమయం అయ్యాయి. మిగతా మండలాల్లో చిరు జల్లులు కురిశాయి.



భారీ వర్షానికి జడ్చర్లలో జలమయం అయిన రహదారి

వంతెన నిర్మాణానికి సహకరించాలి

» ఎంపీ మల్లురవిని కోరిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

» ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేత



ఎంపీ మల్లురవితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట/ అచ్చంపేట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని మద్దిమడుగు సమీపంలో కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి సహకరించాలని అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ ఎంపీ మల్లురవిని కోరారు. శుక్రవారం ఢిల్లీలో ఆయనను కలిసి సమస్యను వివరించి వినతిపత్రం ఇచ్చారు. అంతర్రాష్ట్ర వంతెనతో పాటు అచ్చంపేట మండలంలోని ఉమామహేశ్వరంలో రోప్ వే నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వంతెనను నిర్మిస్తే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య దూరం తగ్గుతుందని, రవాణా సౌలభ్యం కలుగుతుందని ఆయనకు తెలిపారు. అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారని, ఈ విషయాన్ని పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

» వనపర్తి జిల్లా న్యాయాధికారి ఎం.ఆర్ సునీత

వనపర్తి లీగల్ కంట్రిబ్యూటర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వనపర్తి జిల్లా న్యాయాధికారి ఎం.ఆర్.సునీత తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 1 నుంచి సెప్టెంబరు 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి కోర్టుల్లో పెండింగ్ కేసులను విభాగాల వారిగా విభజించినట్లు తెలిపారు. వాటిలో మధ్యవర్తిత్వానికి అనుకూలంగా ఉన్న 654 కేసులను గుర్తించినట్లు చెప్పారు. కేసులను సామరస్యంగా, తక్కువ ఖర్చుతో, వేగవంతంగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఉపకరిస్తుందని తెలిపారు. ఇందులో ఇరు వర్గాలకు విజయం వర్తిస్తుందని చెప్పారు. ఇరువర్గాలు మాత్రమే మాట్లాడుకుంటాయని, వారి సమ్మతితో కేసులు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ 90 రోజుల ప్రణాళికలో భాగంగా గుర్తించిన కేసులకు సంబంధించి ఇరు వర్గాలకు నోటీసులు పంపించనున్నట్లు తెలిపారు. అందులో వైవాహికం, వినియోగదారులు, ఆస్తి విభజన, భూమి, కుటుంబ వివాదాలతో పాటు, రాజకీయ పరిష్కార యోగ్యమైన క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. అనంతరం స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రజని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సెక్రటరీ కె.వెంకటరమణ, ఏజీపీ మునగారి కృష్ణ, న్యాయవాదులు షాకిర్ హుస్సేన్, వెంకటేశ్, శుభారాణి, రాజుగౌడ్, చందర్ నాయక్, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు రఘు, శ్రీదేవి పాల్గొన్నారు.

వుషు ఉమెన్స్ లీగ్‌కు 10 మంది విద్యార్థినులు



వుషు ఉమెన్స్ లీగ్‌కు ఎంపికైన విద్యార్థినులతో అసోసియేషన్ సభ్యులు

జడ్చర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 27న నిర్వహించనున్న ఖేలో ఇండియా వుషు ఉమెన్స్ లీగ్ - 2025 పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 10 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. వారిలో జస్మిత, హారిక, సమన్వి, దీక్షిత, కారుణ్య, మేఘన, జి.హర్షిత, లాస్యశ్రీ, హర్షిత, సమీనాబేగంలను ఎంపిక చేసినట్లు ఉషు అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి తాజుద్దీన్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఇలియాస్ బిన్‌సిద్ధిఖ్, బాలు, అశ్వక్, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

జములమ్మ ఆలయ హుండీ లెక్కింపు


» రూ.29 లక్షల ఆదాయం



హుండీని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, ఎస్‌వీఎస్ సభ్యులు

గద్వాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని జములమ్మ ఆలయం హుండీని శుక్రవారం లెక్కించారు. ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈవో పురేందర్ కుమార్, ఆలయ చైర్మన్ వెంకట్రాములు ఆధ్వర్యంలో హుండీల సీళ్లు తొలగించి నగదును లెక్కపెట్టారు. మొత్తం 4 నెలల హుండీని లెక్కించగా రూ.29,34,460 ఆదాయం సమకూరింది. అందులో రూ.27,06,880 నోట్లు, రూ.2,27,580 నాణేలు ఉన్నాయి. దీంతో పాటు దాదాపు అర కిలో మిశ్రమ వెండి వచ్చింది. హుండీ లెక్కింపులో ఆలయ డైరెక్టర్లు మంగలి వీరేశ్, ముసిలన్న, చందు, మల్లేశ్, మధుమతి, రాధారెడ్డి, బీసన్న, ఎస్‌వీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీవో కుమారుడు




ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తన కుమారునికి అడ్మిషన్ తీసుకుంటున్న ఎంపీడీవో శంకర్‌నాయక్

చారకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ ఎంపీడీవో మాలోతు శంకర్‌నాయక్ తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, తోటి ఉద్యోగులకు ఆదర్శప్రాయుడిగా నిలిచాడు. శుక్రవారం ఆయన తన కుమారుడు మాలోతు భువన్ సాయి నాయక్‌ను చారకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో చేర్పించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను జీహెచ్ఎం భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

తాడూరు/ నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష పడినట్లు తాడూరు ఎస్ఐ గురుస్వామి, నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని యంగంపల్లి గేట్ సమీపంలో రెండు రోజుల క్రితం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో గుంతకోడూరు గ్రామానికి చెందిన కొప్పునూర్ వెంకటయ్య మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. శుక్రవారం అతడిని కోర్టులో హాజరుపర్చగా ఒక రోజు జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి శ్రుతి దూత ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్ తెలిపారు. అలాగే మిడ్జిల్ మండలం బోయినపల్లికి చెందిన బోయలాలు మద్యం తాగి వాహనం నడుపుతూ నాగర్‌కర్నూల్‌లో పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరు పరచగా ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు.



'పేట' కలెక్టరేట్‌లో గాంధీ చిత్రాన్ని వేస్తున్న లక్ష్మణ్



కింగ్‌డమ్ కటౌట్‌ను తయారు చేస్తున్న లక్ష్మణ్

పేట నుంచి సినీ పరిశ్రమకు..

» చిత్రకళలో లక్ష్మణ్‌ది అందెవేసిన చేయి

» పలు సినిమా కటౌట్లకు కుంచెతో రంగులు అద్దిన కళాకారుడు

నారాయణపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటకు చెందిన చిత్రకళాకారుడు అక్కల లక్ష్మణ్ అంచెలంచెలుగా ఎదిగారు. తాజాగా చిత్రపరిశ్రమలో కింగ్‌డమ్ చిత్రంలో 80 శాతం తన కుంచెతో రంగులు దిద్దిన చిత్రాలు ఎన్నో వేశారు. తన చేతి నైపుణ్యంతో ఆకట్టుకునే విధంగా విభిన్న ఆకృతులతో చిత్రాలు గీయడంలో దిట్టగా పేరు తెచ్చుకున్నారు. నారాయణపేటలో గణేష్ నిమజ్జన వేడుకల్లో ఎన్నో విభిన్నమైన అలంకరణలు తన చేతితో వేసి కళా నైపుణ్యాన్ని చాటుతూ వస్తున్నాడు. పాఠశాలలకు సైతం రంగులు వేయడంలో దిట్టగా పేరుంది. నారాయణపేట కలెక్టరేట్ చాంబర్‌లో గాంధీ చిత్రం చక్కగా వేశారు. ఎంతో మంది రాజకీయ నేతలు, ప్రముఖుల ముఖ చిత్రాలు వేసి వారికి అందిస్తూ ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం సినీరంగంలో బాగ్ సాధే బాగ్, కోర్టు, పెద్ది, కింగ్‌డమ్ చిత్రాలకు పనిచేస్తున్నారు.



సెట్‌లో విజయ్‌దేవరకొండ చిత్రం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● తహసీల్దార్ శ్రీనివాసులు



కోస్గి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

వర్షాల కారణంగా ఏమైన చర్యలు తీసుకుంటున్నారా?

పాత ఇళ్లల్లో, శిథిలావస్థలో ఉన్న గోడల పక్కన ఎవరూ ఉండకూడదు. ఈ విషయాన్ని తెలియజేస్తూ గ్రామాల్లో టాంటాం వేయించాలని పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశాం.

చెరువులు కుంటలు ఎక్కడైనా నిండాయా?

మండలంలో చెరువులు, కుంటలు ఎక్కడా నిండలేదు. కానీ వాగు పారుతోంది. మండలంలోని కొత్తపల్లి వరకు వాగులో నీరు వచ్చింది.

చెరువులు, వాగుల వద్ద ప్రజల అప్రమత్తత కోసం అధికారులను నియమించారా?

గ్రామాల్లో కార్యదర్శులు, ఇరిగేషన్ లష్కర్ల ద్వారా సమాచారం అందుకుంటున్నాం. వారిని అప్రమత్తంగా ఉండాలని సూచించాం.

న్యూస్ బాక్స్

నేడు జిల్లాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

నారాయణపేట/మక్తల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లాలో శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పర్యటించనున్నారు. తొలిసారి అధ్యక్షుడి హోదాలో సాయంత్రం 4 గంటలకు మరికల్‌కు రానున్న ఆయనకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలుకుతారు. అనంతరం పేట పట్టణంలోని మెట్రో ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 4:30 గంటలకు జరిగే పార్టీ సమావేశంలో ఆయనతో పాటు పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ పాల్గొంటారని జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన వివరాలపై మక్తల్ మండలం సంగంబండ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీ కాంత్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకోవాలి

మాగనూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాటిన ప్రతీ మొక్కను రక్షించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వర్కూరు గ్రామంలో 75వ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల వద్ద ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల కాలుష్య నివారణ, స్వచ్ఛమైన గాలి, వర్షాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ హర్షవర్దన్, మాజీ వైస్ ఎంపీపీ తిప్పయ్య, కాంగ్రెస్ నాయకులు మొగులప్ప, నరసింహ, తాయప్ప, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

మాగనూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో స్వీడు పీఎస్‌హెచ్-24 రకం పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల పశువైద్యాధికారి డాక్టర్ వినరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు కిలోల పశుగ్రాస విత్తనాల ధర రూ.500, సబ్సిడీ రూ.375 పోను రైతులు రూ.125లు చెల్లించి విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. ఒక్కో రైతుకు 20 కిలోలు మాత్రమే ఇస్తామన్నారు. పట్టాపాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ చూపించి విత్తనాలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఛత్రపతి శివాజీ విగ్రహం ప్రతిష్ఠాపనకు భూమిపూజ

నర్వ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జక్కన్నపల్లి వెళ్లే రోడ్డులో నర్వ గ్రామ యువకులు, పెద్దలు ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం శుక్రవారం భూమిపూజ చేశారు. ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి, నినాదాలు చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యురాలు డా.వీణావతిశంకర్, ప్రతిభ టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ హనుమంత్‌రెడ్డి, సర్పంచ్ సంధ్య, ఆంజనేయులు, యాంకి వెంకటేష్, రామన్‌గౌడ్, వెంకటేష్, బాలప్ప, విండో చైర్మన్ నర్సింలు, రామాంజి, అజయ్, కటిక శ్రీనివాసులు, వావిళ్లరవి, కట్టశేఖర్ పాల్గొన్నారు.

దీర్ఘకాల రుణాల చెక్కులు అందజేత

కోస్గి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కోస్గిలో దీర్ఘకాల రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి చెక్కులు అందించారు. ముక్తిపాడ్‌కు చెందిన కుర్వ తులిశమ్మకు గొర్రెల పెంపకానికి రూ.10 లక్షలు, పోతిరెడ్డిపల్లికి చెందిన కృష్ణయ్యకు రూ.10 లక్షలు ఇచ్చామన్నారు.

సింగారంలో పారిశుధ్యం పనులు

నారాయణపేటరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగారం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్యం పనులు చేపట్టారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రజలకు అంటువ్యాధులు సోకకుండా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పర్యవేక్షణలో మురుగునీటి కాలువలను శుభ్రం చేసి, వీధుల్లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించారు.

సమస్యల్లో సర్జఖాన్‌పేట

» దర్శనమిస్తున్న గుంతల రోడ్లు, పాడుబడ్డ ఇళ్లు

» ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

కోస్గి రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోస్గి మండలంలోని సర్జఖాన్‌పేట గ్రామానికి మండలంలో ప్రత్యేక స్థానం ఉంది. ప్రధాన పార్టీలకు చెందిన గుర్తింపు ఉన్న నాయకులు ఈ గ్రామంలో ఉన్నారు. గత బీఆర్ఎస్ పాలనలోను, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోను ముఖ్యమైన రాష్ట్ర నాయకులతోనూ మంచి సంబంధాలున్న నాయకులు ఇక్కడ ఉన్నారు. సమస్యలు కూడా పెద్ద ఎత్తున ఉన్నాయి. గ్రామంలో దాదాపు 4500కి పైగా జనాభా ఉంది.



శిథిలావస్థకు చేరుకున్న మహిళా సమాఖ్య భవనం

ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారు. ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం మానేశారు. చిన్నపాటి వర్షాలకు గ్రామంలోని అంతర్గత రోడ్లన్నీ నీటి గుంతలను తలపిస్తున్నాయి. ఇళ్ల మధ్యలో పిచ్చి మొక్కలు పెరిగి వాటి వల్ల పాముల బెడదతో గ్రామస్థులు భయంభయంగా గడుపుతున్నారు. గ్రామంలో పాడు బడ్డ ఇళ్లను అలాగే వదిలేశారు. ముందే వర్షాకాలం ఎప్పుడు ఏమవుతుందోనని గ్రామస్థులు వాపోతున్నారు. ఎప్పుడో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం శిథిలావస్థకు చేరుకుంది. మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించుకోవాలంటే సభ్యులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో పాటు పారిశుధ్య సమస్య, వీధి లైట్లు సరిగ్గా వెలగకపోవడం వంటి పలు సమస్యలు గ్రామంలో ఉన్నాయి.



గ్రామంలో కూలిపోయేలా ఉన్న ఓ ఇల్లు

ఆంధ్రజ్యోతి వార్డు వాచ్

వీధి లైట్లు లేక ఇబ్బంది పడుతున్నాం..



వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రిపూట బయటికి రావాలంటే భయంగా ఉంది. గ్రామంలో గుంతల రోడ్లను సరిచేయాలి. అవసరమున్న చోట సీసీ రోడ్లు వేయాలి. వర్షాకాలంలో స్వచ్ఛమైన నీటి సరఫరా చేయాలి. - బస్వరాజ్‌గౌడ్

పాడుబడ్డ ఇళ్లలోని ప్రజలను అప్రమత్తం చేశాం..

పాడుబడ్డ ఇళ్లలో ఉండొద్దని గ్రామంలో చాటింపు వేశాం. రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించే కార్యక్రమం త్వరలో చేపడతాం. ఇళ్ల మధ్య చెత్తాచెదారాన్ని తీసివేసి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించాం. వీధి దీపాల మరమ్మతులు చేపట్టాం. కొత్త మహిళా సమాఖ్య భవనం కోసం ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపించాం. నిధులు మంజూరయ్యాయి.

- అరుణ, పంచాయతీ కార్యదర్శి

శ్రావణమాస పూజలు ప్రారంభం

» ఆలయాలను దర్శించుకున్న భక్తులు

» గౌరీ పూజల్లో మహిళలు

నారాయణపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శ్రావణమాసం పూజలు ప్రారంభమయ్యాయి. ఇళ్లల్లో మహిళలు వ్రతాలు, లక్ష్మీగౌరి పూజలు శక్తిశ్రద్ధలతో ఆచరించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో భక్తులు పలు ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. నారాయణపేట మండలం లోకాయపల్లి లక్ష్మమ్మ దేవాలయానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. అర్చకుడు సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మంగళహారతి, ఒడి నింపడం, నైవేద్యం తదితర పూజలు నిర్వహించారు. పేట ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పేట శక్తిపీఠంలో స్వామి శాంతానంద నేతృత్వంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలోని అంబభవాని, చౌడేశ్వరి, దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.



లక్ష్మమ్మ దేవాలయంలో ఆర్టీసీ డీఎం లావణ్యను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా ఎర్రసత్యం జయంతి

మరికల్/ధన్వాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే దివంగత ఎర్రసత్యం జయంతిని శుక్రవారం మరికల్ మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ చౌరస్తాలో అఖిల పక్ష నాయకులు, ముదిరాజ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎర్రసత్యం చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముదిరాజ్‌లకు, మత్స్య సహకార సంఘానికి, బీసీ, బలహీన వర్గాలకు ఎర్రసత్యం చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, కానుగంటి నారాయణ, సాలేకృష్ణయ్య, పోలేమోని రమేష్, వీరబసంతు, వీరన్న, రామకృష్ణ తదితరులున్నారు.



మరికల్‌లో ఎర్రసత్యం జయంతి వేడుకలు జరుపుకుంటున్న అఖిలపక్ష నాయకులు

అదేవిధంగా, ధన్వాడలో ఎర్ర సత్యం చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నీరటి నర్సిములు నాయుడు, నీరటి రాంచంద్రయ్య, చీరాల సుధాకర్‌రెడ్డి, రహిమున్‌ఖాన్, జి.నర్సిములు, సంద లక్ష్మన్న, ఊసేనయ్య, కెంచె రఘువీర్ ఉన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు సత్కారం

మక్తల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నిత్యం డ్యూటీలో బిజీగా ఉండే జీవితాలు పోలీసులవి. మిగతా ఉద్యోగుల మాదిరిగా కుటుంబానికి సమయం ఇచ్చేది చాలా అరుదు. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా పోలీసులు ఒకరికొకరే తోడుంటారు. అందుకు నిదర్శనంగా నిలిచింది మక్తల్ పోలీస్‌స్టేషన్. మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో గర్భిణీగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ చైతన్యకు సీఐ రాంలాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, మహిళా ఎస్ఐ రేవతి, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో స్టేషన్ ఆవరణలో చీర, పూలు, పండ్లు అందించి సత్కరించారు. ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి అయిన చైతన్య సెలవుపై వెళ్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆమెను సన్మానించారు.



మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ చైతన్యకు శ్రీమంతం చేస్తూ సత్కరిస్తున్న పోలీస్ సిబ్బంది

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

దామరగిద్ద, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.జయచంద్రమోహన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు వివరాలతో పాటు, సీజనల్ వ్యాధుల పట్ల, ఫ్రైడే డ్రైడే యాక్టివిటీ ఏ విధంగా నిర్వహిస్తున్నారనే అంశాలను పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు గ్రామాల్లోని అన్ని శాఖల సహకారంతో ఎక్కడ కూడా అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు.



పీహెచ్‌సీ సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మక్తల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కర్ని పీహెచ్‌సీ డాక్టర్ తిరుపతి, డాక్టర్ మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం మండలంలోని సంగంబండ గ్రామంలో ప్రధానమంత్రి ఇంటెన్సిఫైడ్, టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలకు రక్తనమూన పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థులు టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ వినోద్‌గౌడ్, డాక్టర్ నవీన, డాక్టర్ శ్రీలత, వైద్య సిబ్బంది సాయిబాబా, సులోచన, ఆండాలమ్మ, శ్రీధర్‌కుమార్, బాల్‌రాజ్, బలరాంరెడ్డి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఓంఎంఐఎఫ్ ఆధ్వర్యంలో...

మాగనూరు : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం ఓంఎంఐఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో ప్రజలకు బీపీ, షుగర్, మోకాళ్లనొప్పి, రక్త బలహీనత తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రాజమ్మ తెలిపారు. డాక్టర్లు తమ్, పృథ్వీరాజ్, మెడికల్ ఇన్‌చార్జి సోమ్‌సన్, మండల కోఆర్డినేటర్ శాంతప్ప, నర్సింలు, హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు.

మీసేవ ఆపరేటర్లకు శిక్షణ

నారాయణపేటటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మీ సేవలో ప్రస్తుతం ఉన్న సర్వీసెస్‌తో పాటు నూతనంగా ప్రవేశపెట్టిన సర్వీసులపై జిల్లాలోని అన్ని మీసేవా కేంద్రాల ఆపరేటర్లకు కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్యాస్ట్ సర్టిఫికెట్, మ్యారేజ్ సర్టిఫికెట్‌లపై శిక్షణనిచ్చి హెల్త్ ఇన్సూరెన్స్‌ల గురించి అవగాహన కల్పించారు. జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్, మీసేవ సూపరింటెండెంట్ దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక పోరులో సత్తా చాటాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ

మరికల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, గ్రామ స్థాయిలో పార్టీ బలాన్ని పెంచుకునేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని నంది ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మంగలి వేణు అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశంలో నాగూరావు నామాజీ మాట్లాడారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు మెంబర్ నుంచి సర్పంచ్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త గడపగడపకు వెళ్లి పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిరంతరం ప్రజల్లో ఉండాలని కోరారు. పార్టీ అధికార ప్రతినిధి చిన్న నర్సన్‌గౌడ్, తిరుపతిరెడ్డి, శ్రీరామ్, వెంకటేష్ సురేందర్, పోలేమెని రమేష్, శెట్టి మహేందర్, గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ సమావేశం

మక్తల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారక ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ మండల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు చిన్న హన్మంతు, మాజీ కౌన్సిలర్ అన్వర్‌హుసేన్ కోరారు. శుక్రవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలపై చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తారని, నాయకులు హాజరు కావాలని కోరారు. నాయకులు జుట్ల శంకర్, సాదిక్, మనోహర్ ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నారాయణపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మరికల్ మండలం ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సుజాతరవికుమార్ శుక్రవారం నారాయణపేట సీవీఆర్ బంగ్లాలో కాంగ్రెస్ పార్టీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కుంభం పార్టీ కండువాను వేసి రవికుమార్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, సత్యనారాయణ, సుదర్శన్‌రెడ్డి, దూల శ్రీను, జనార్ధన్, బంగారు శ్రీను, గుడిసె వెంకటేష్, తెలుగు శివ ఉన్నారు.

కొనసాగుతున్న సంగంబండ రిజర్వాయర్ నీటి విడుదల

నారాయణపేటటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం నుంచి నీటి విడుదల శుక్రవారం కొనసాగింది. ఎగువ నుంచి వరద ఎక్కువ వస్తుండడంతో శుక్రవారం ఒక గేటును ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులో వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 500 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని, రిజర్వాయర్ నీటి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.4 టీఎంసీలు ఉందని డీఈ సురేష్ తెలిపారు.

పరిహారం పెంపు కోసం సీఎంకు విన్నవిస్తా

» కాంగ్రెస్ పార్టీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి

» భూనిర్వాసితులకు చెక్కుల పంపిణీ

నారాయణపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూనిర్వాసితులకు అందించే పరిహారం పెంపు కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తానని కాంగ్రెస్ పార్టీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణపేట ఆర్డీవో కార్యాలయంలో భూనిర్వాసితులకు పరిహారం చెక్కులను ఆయన ఆర్డీవో రాంచందర్‌తో కలిసి అందజేశారు. పేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన 15 మంది రైతులకు 3.29 ఎకరాలకు గాను రూ.52 లక్షల 15 వేల చెక్కులు అందించారు. అలాగే దామరగిద్ద మండలం బాపన్‌పల్లి గ్రామానికి చెందిన 21 మంది రైతులకు రూ.59 లక్షల 99 వేల చెక్కులు అందించారు. ఈ సందర్భంగా శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు దేశంలో ఎక్కడా ఇంత తక్కువ సమయంలో నష్ట పరిహారం అందలేదన్నారు. మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, తహసీల్దార్లు తిరుపతయ్య, వెంకటేష్, ఏవో అనిల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ బాల్‌రాజ్, మదన్‌మోహన్, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది కాకర్ల భీమయ్య, జాజాపూర్ శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.



ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాంచందర్‌తో కలిసి చెక్కులు అందిస్తున్న కుంభం శివకుమార్‌రెడ్డి

కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన

దామరగిద్ద, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని క్యాతన్‌పల్లి గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం భీష్మ రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న నూతన కల్యాణ మండప నిర్మాణానికి ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి సభ్యులు, దేవాలయ నిర్వాహకులతో కలిసి శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం రాజ్‌కుమార్‌రెడ్డిని దేవాలయ నిర్వాహకులు, పురోహితులు శాలువాతో సత్కరించి స్వామి వారి ఫొటోను బహూకరించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షులు బసంత్‌రాజ్‌పటేల్, కోడ్లి శరణప్ప, పురోహితులు శివకుమార్, శరణయ్య, గణేష్, చెన్న, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, రాఘవేందర్‌గౌడ్ తదితరులున్నారు.



క్యాతన్‌పల్లిలో వీరభద్రేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో కల్యాణ మండపానికి భూమి పూజ చేస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

పళ్లబురుజు ప్రాంతంలో నీటి సమస్యకు పరిష్కారం..

నారాయణపేట టౌన్ : నారాయణపేట మునిసిపాలిటీలోని 11వ వార్డు పళ్లబురుజు ప్రాంతంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి గాను ప్రాంత ప్రజల కోరిక మేరకు భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి బోరును వేయించారు. ఫౌండేషన్ సభ్యులు, కాలనీ పెద్దలతో కలిసి బోరు పనులకు భూమిపూజ చేసిన రాజ్‌కుమార్‌రెడ్డిని ప్రాంత ప్రజలు సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ పెద్దలు శ్రీకాంత్, గడ్డం సిద్దు, కనికి శ్యామ్, ఎల్లప్ప, క్యాతన్‌పల్లి శివ, పరిగి శ్రీనివాస్ తదితరులున్నారు. అదేవిధంగా, పట్టణంలోని మోడ్రన్ స్కూల్‌కు రాజ్‌కుమార్‌రెడ్డి ఎల్ఈడీ టీవీని అందజేశారు. ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ఖలీల్‌అహ్మద్, స్కూల్ కరస్పాండెంట్ అబ్దుల్‌ఖాదర్, హెచ్ఎం జాకీర్‌హుస్సేన్, తాజ్ తదితరులున్నారు.

రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలి

నారాయణపేటరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని కాపాడాలంటే గిట్టుబాటు ధర కల్పించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కృష్ణ డిమాండ్ చేశారు. పేట జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో జిల్లా ప్రథమ మహాసభలనుద్దేశించి ఆయన మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫారుల మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పెట్టుబడిపై 50 శాతం కలిపి ధర నిర్ణయించాలన్నారు. దేశంలో దాదాపు 54 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని, వెంటనే విరమించుకోవాలని సూచించారు. సంఘాల నాయకులు బి.రాము, భగవంతు, యాదగిరి, సలీం, కె.కాశీనాథ్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

మఠం భూములు రక్షించాలి

నారాయణపేటటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శంకర భారతి పేరిట విస్తరించి ఉన్న కర్ణాటక హంపి విరుపాక్ష విద్యారణ్యస్వామి మఠం భూములను పరిరక్షించి, మఠం పేరిట పట్టాదారు పాసు బుక్కులను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్‌యాదవ్ శుక్రవారం పేటలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు, ఊట్కూర్‌లో తహసీల్దార్ చింత రవికి మఠం తరుపున వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రఘువీర్‌యాదవ్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాలో ఉన్న హంపి మఠం పేరిట నారాయణపేట, ఊట్కూరు, దౌల్తాబాద్, కల్వకుర్తి, అచ్చంపేటతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజీపేట, ఆవంచ గ్రామాల్లో విస్తరించబడి ఉన్న భూముల్లో ఇప్పటికే చాలామంది నకిలీ పాస్ బుక్కులు సృష్టించి అక్రమ పట్టాలను చేసుకున్నారని తెలిపారు. మిగిలిపోయిన మఠం భూములను కూడా భూభారతి చట్టాన్ని అడ్డం పెట్టుకొని దొంగ సాదాబైనామాలు, జీపీఏలు, ఓఆర్సీలను సృష్టించుకొని రెవెన్యూ అధికారుల సహకారంతో పాస్ బుక్కులు సృష్టించుకున్నట్లు తెలిసిందని వాటి నియంత్రణ కోసం హంపి పీఠం భక్తులందరు ఏకమై అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఆయా మండల తహసీల్దార్లకు సూచనలు ఇచ్చి మఠం భూముల అక్రమ బదిలీలను నిలిపి వేయాలని, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హంపి మఠం భక్తజన మండల సభ్యులు మేల గిరిరావు, కాంబ్లే, రామచంద్రయ్య, అడ్వకేట్ డాక్టర్ క్యాతన్ రఘునాథ్, శివకుమార్ ఉన్నారు.



పేటలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హంపి మఠం భక్తులు

కర్ణాటక ఆర్టీసీ బస్సులు ఆపాలి



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కున్సి గ్రామస్థులు

కృష్ణ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం యాదగిరి నుంచి రాయచూర్ వెళ్లే బస్సులు కున్సి గేట్ వద్ద ఆపాలని బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లె నర్సప్ప ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోలో ఆయన మాట్లాడుతూ మండలంలోని కున్సి, అలంపల్లి, చేగుంట గ్రామాల నుంచి ప్రజలు నిత్యం రాయచూర్, యాదగిరి, శక్తినగర్, గుల్బర్గా తదితర పట్టణాలకు రాకపోకలు కొనసాగిస్తారని, కర్ణాటక ఆర్టీసీ అధికారులు ఇక్కడ స్టాప్ ఇవ్వకుండా ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. విషయాన్ని రాయచూర్, యాదగిరి ఆర్టీసీ డిపో మేనేజర్‌ల దృష్టికి అఖిలపక్షం నాయకులు తీసుకువెళ్లినా కూడా ఫలితం లేనందున రాస్తారోకో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లింగప్ప, మాజీ సర్పంచ్ ధర్మరాయ, మాజీ ఉప సర్పంచ్ బాలరాజు, కాంగ్రెస్ నాయకులు పిట్టల సిద్దప్ప, పల్లె సురేష్, శరణప్పగౌడ, మల్లన్నగౌడ్, మహదేవ్, చందు, సాయిబన్న, బలెం కిష్టప్ప, శ్యామ్‌గౌడ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.